100 రోజుల్లో 6 గ్యారెంటీలు

మొదటిపేజీ తరువాయి...

సాధించి, బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు. అనుభవంతో కూడిన మంత్రివర్గం యువత సారథ్యంలో కొలువుదీరిందని వెల్లడించారు. మార్పు దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఇప్పటికే ఫలాలు మొదలయ్యాయని చెప్పారు. సీఎంగా బాధ్యతలు చేపట్టగానే రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల అమలు ఫైల్‌పై సంతకం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే రెండు గ్యారెంటీలను అమల్లోకి తెచ్చారని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచారని చెప్పారు. కొత్త ఏడాదిలో రైతులు, యువత, మహిళలు, పేదల జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపుతామని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళి అర్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రతి హామీ నెరవేర్చుతాం

మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని గవర్నర్ స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేసేందుకు కార్యాచరణ తీసుకుంటామని అన్నారు. రైతు, యువ, ఎస్సీ-ఎస్టీ, బీసీ డిక్లరేషన్లను అమలు చేస్తామని తెలిపారు. ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మెగా డీఎస్సీ నిర్వహించి, ఆరు నెలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని వివరించారు. అమరవీరుల కుటుంబాలను త్వరలో గుర్తించి, ఇంటి స్థలం, పెన్షన్ అంజేస్తామని అన్నారు. ప్రతి పంటకు మద్దతు ధర కల్పిస్తామని, రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలో కార్యాచరణ ఉంటుందని వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలన్నది తమ సంకల్పమని స్పష్టం చేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పూర్తిచేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు లేనివారికి ఇంటి స్థలం, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించడానికి త్వరలో కార్యాచరణ ప్రారంభిస్తామని చెప్పారు. 'ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష అదనంగా సాయం అందిస్తాం. గతంలో పేదలకు పంచిన 25 లక్షల ఎకరాల భూమిపై పేదలకు పూర్తి స్థాయి భూ హక్కులు కల్పిస్తాం. ధరణి స్థానంలో భూమాత పోర్టల్‌ను తేవడానికి త్వరలో కార్యాచరణ మొదలవుతుంది. డ్రగ్స్ మాఫియాను నిర్మూలించే దిశగా చర్యలు మొదలుపెట్టాం. రాష్ట్రంలో అభివృద్ధిని వికేంద్రీకరిస్తాం. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా.. ఔటర్ లోపల, ఔటర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు మధ్య, రీజినల్ రింగురోడ్డు అవతల ప్రాంతాలుగా విభజిస్తాం. దానికి తగట్టుగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తాం' అని వివరించారు. 'ప్రజాస్వామ్యం అనేది ఒక ప్రభుత్వ పాలన రూపం మాత్రమే కాదు, అది తోటి మానవుల పట్ల గౌరవాదరణలతో కూడిన ఒక వైఖరి' అని అంబేద్కర్ చెప్పిన విషయాలను గుర్తుచేశారు. తమ ప్రభుత్వం మాటల కన్నా చేతలనే ఎక్కువగా నమ్ముకున్నదని పేర్కొన్నారు.

21 నిమిషాల పాటు గవర్నర్ ప్రసంగం

ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు శాసనసభకు వచ్చిన గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు సభలోకి వచ్చిన గవర్నర్‌ను చైర్మన్, స్పీకర్ కలిసి స్పీకర్ చైర్ వద్దకు తీసుకెళ్లారు. జాతీయ గీతాలాపన అనంతరం 11.32 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగాన్ని ప్రారంభించారు. 18 పేజీల ప్రసంగాన్ని చదివేందుకు 21 నిమిషాల సమయం తీసుకున్న గవర్నర్.. తన ప్రసంగాన్ని 11.55 గంటలకు ముగించారు. ప్రసంగం చివర్లో ప్రముఖ కవి దాశరథి రచించిన 'ఆ చల్లని సముద్ర గర్భం' గేయాన్ని చదివేందుకు తొలుత తడబడ్డారు. ఆ తర్వాత పలువురు సభ్యుల కోరిక మేరకు గవర్నర్ మళ్లీ ఆ గేయాన్ని చదవి, జై భారత్, జై తెలంగాణ నినాదంతో తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం గవర్నర్‌కు చైర్మన్, స్పీకర్, సీఎం వీడ్కోలు పలికారు.

గవర్నర్ ప్రసంగానికి నేడు ధన్యవాద తీర్మానం

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు శనివారం కూడా జరుగనున్నాయి. ఉదయం 10 గంటలకు ఉభయ సభలు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేసిన ప్రసంగానికి శనివారం శాసనసభలో ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీలో సభానాయకుడు రేవంత్‌రెడ్డి, ప్రతిపక్షాల నుంచి కే తారకరామారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తోపాటు విపక్ష పార్టీల సభ్యులు మాట్లాడుతారు. శాసనమండలిలోనూ అధికార, విపక్ష సభ్యులు ధన్యవాద తీర్మానంపై మాట్లాడుతారు. అనంతరం స్పీకర్ నేతృత్వంలో సభను ఎన్నిరోజులు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు.

500 సిలిండర్‌పై ప్రభుత్వం కసరత్తు

- పౌరసరఫరాల అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్ సమీక్ష
- అమలు చేసే విధానం, ఆర్థికంగా పడేభారంపై ఆరా

హైదరాబాద్, డిసెంబర్ 15(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన రూ.500కే గ్యాస్ సిలిండర్‌పై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పథకం అమలు విధివిధానాలపై పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి? పట్టణాల్లో ఉన్నవెన్ని? పల్లెల్లో ఎన్ని ఉన్నాయి? ప్రతినెలా రీఫిల్ బుక్ చేసుకుంటున్నవారు ఎంతమంది? పథకం అమలు చేస్తే ప్రభుత్వంపై పడే ఆర్థికభారం ఎంత? అన్న అంశాలపై మంత్రి ఆరా తీశారు. వీటిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం కావాలని మంత్రి భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఆ తర్వాతే రూ. 500కే గ్యాస్ సిలిండర్‌పై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పౌరసరఫరాలశాఖపై నిర్వహించిన తొలి సమీక్షలో మంత్రి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా అందించే రూ. 500 గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తే ప్రభుత్వంపై ప్రతి ఏటా రూ. 3వేల నుంచి రూ.4వేల కోట్ల భారం పడే అవకాశం ఉన్నదని తెలిపారు. సమీక్షలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మీడియా పాయింట్

శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

ప్రసంగమా? మ్యానిఫెస్టో పఠనమా?

- గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేదీ లేదు
- రోడ్‌మ్యాప్ ప్రకటించలేదు
- కాంగ్రెస్ అసత్యాలు చెప్పించింది
- గవర్నర్ గతంలో ఏమి మాట్లాడారో.. ఇప్పుడేమి మాట్లాడారో సమీక్షించుకోవాలి
- ప్రభుత్వం ఇచ్చే శ్వేతపత్రాలపై సమాధానం చెప్తాం
- అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): గవర్నర్ ప్రసంగం పూర్తిగా కాంగ్రెస్ మ్యానిఫెస్టో చదివినట్టుగా ఉన్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ చేసిన ప్రసంగంలో కొత్తదనమేదీ లేదని పేర్కొన్నారు. గత పదేండ్లుగా తెలంగాణ తిరోగమనంలో ఉన్నదని పేర్కొన్న గవర్నర్.. గతంలో ఏమి మాట్లాడారో, ఇప్పుడేమి మాట్లాడారో సమీక్షించుకోవాలని సూచించారు. గత పదేండ్లలో వివిధ రంగాల్లో తెలంగాణ సాధించిన ప్రగతిని, వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థలు ప్రశంసించిన విషయాన్ని గవర్నర్ మరచిపోయారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు ఎటువంటి ప్రణాళిక గవర్నర్ ప్రసంగంలో లేదని దుయ్యబట్టారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి రాబోయే ఐదేండ్ల రోడ్‌మ్యాప్‌ను ప్రకటించలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. నూతన ప్రభుత్వం ఏ మార్గం ఎంచుకుంటుంది? ఏ రకమైన ప్రణాళికలు రూపొందించించనున్నదో వెల్లడించలేదని విమర్శించారు.

2014లోనే తెలంగాణకు విముక్తి

ప్రజలందరూ ఇప్పుడే సంతోషపడుతున్నట్టు, స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నట్టు గవర్నర్ ప్రసంగంలో పేర్కొనడం సరైంది కాదని కడియం శ్రీహరి స్పష్టంచేశారు. గత పదేండ్లుగా తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చారని వివరించారు. ఇప్పుడే తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తి అయిందంటూ గవర్నర్ చెప్పడం సరికాదని, అబద్ధాలు చెప్పడం దురదృష్టకరమని మండిపడ్డారు. ఇది గవర్నర్ పదవికి శోభనివ్వదని చెప్పారు. 'తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నారు. 2014లోనే తెలంగాణ నిర్బంధం నుంచి విముక్తి అయింది. ఇప్పుడు కావడమేమిటి?' అని ప్రశ్నించారు.

బోనస్ ధర ప్రస్తావన ఏదీ?

గవర్నర్ చేత రాష్ట్ర ప్రభుత్వం అసత్యాలు చెప్పించిందని, గత ప్రభుత్వాన్ని విమర్శించేందుకు గవర్నర్ ప్రసంగాన్ని వాడుకున్నదని కడియం శ్రీహరి దుయ్యబట్టారు. గవర్నర్ ప్రసంగంలో దళితబంధు, మద్దతు ధరకు రూ.500 బోనస్ ప్రస్తావన లేదని విమర్శించారు. దీనిని బట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా కనబడటం లేదని పేర్కొన్నారు. గతంలో 24 గంటల కరెంట్ ఇవ్వలేదన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ .. తమ హయాంలో 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదని రైతులు, ప్రజలు రోడ్డెక్కిన పరిస్థితులు ఎక్కడా లేవని గుర్తుచేశారు. ప్రభుత్వం విడుదల చేసే శ్వేతపత్రాలపై సరైన సమాధానం చెప్తామని స్పష్టంచేశారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలె యాదయ్య, కాలేరు వెంకటేశ్, అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు శంభీర్‌పూర్ రాజు, ఎంసీ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రివర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 12,13,14 తేదీల్లో మూడు రోజులపాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు హైదరాబాద్‌లోని ఎంబీభవన్‌లో ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన జరిగాయి. కేంద్ర పరిశీలకులుగా ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఏ విజయరాఘవన్ హాజరయ్యారు. సమావేశం వివరాలను శుక్రవారం తమ్మినేని మీడియాకు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అనుసరించిన ఎత్తుగడలు, ఫలితాలపై సమీక్షించామని చెప్పారు. పోటీచేసిన 19 స్థానాల్లో గెలుస్తామని భావించకపోయినా ఓట్లు తక్కువ రావడం ప్రధాన లోపంగా పార్టీ గుర్తించిందని వివరించారు. తమకు సీపీఎం కుటుంబాలే ఓటేశాయి తప్ప సంప్రదాయంగా వేసే అభిమానులు వేయలేదని వివరించారు. దీంతో సీపీఎం ఓట్ల శాతం పడిపోయిందని చెప్పారు. గత ఎన్నికలతో పోల్చితే బీజేపీకి ఓట్లు, సీట్లు రెట్టింపయ్యాయని, ఇది ప్రమాదకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మతోన్మాద శక్తులు బలపడడానికి ఇది సంకేతంగా ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి వారంలోనే రెండు గ్యారంటీలను అమలు చేయడం శుభపరిణామమని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గాయపడటం బాధాకరమని అన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుదారుల తాకిడి

న్యాయం చేయాలని డీఎస్సీ-2008 బాధితుల వినతి

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదుదారుల తాకిడి ఎక్కువయ్యింది. మంగళ, శుక్రవారాల్లోనే ప్రజావాణి నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడంతో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు తమ సమస్యలు చెప్పుకొనేందుకు ప్రజలు క్యూ కట్టారు. డీఎస్సీ 2008 బాధిత అభ్యర్థులు సుమారు 70 మంది వరకు తరలివచ్చారు. 2008 డీఎస్సీలో మెరిట్ వచ్చినా తమకు అన్యాయం జరిగిందని చెప్పారు. దాదాపు 1200 మంది బాధితులుగా మారామని, 14 ఏండ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హోంగార్డుల సమస్యలపై సైబరాబాద్ హోంగార్డ్స్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, తెలంగాణ స్టేట్ ట్రెజర్ హరిబాబు సమస్యలు విన్నవించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, ఆయుష్ శాఖ కమిషనర్ హరిచందన, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఫిర్యాదులను స్వీకరించారు.

చీఫ్ విప్ నాకెందుకు? ఇస్తే మంత్రి పదవి ఇవ్వండి

- తెగేసి చెప్పిన వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): 'చీఫ్ విప్ పదవిపై నాకు ఆసక్తిలేదు. ఆ పదవి నాకెందుకు? అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెగేసి చెప్పారు. తనకు మంత్రి పదవి మాత్రమే కావాలని, లేదంటే ఇంకేమీ వద్దని ఆయన స్పష్టం చేశారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నలుగురు ప్రభుత్వ విప్‌లను నియమించింది. ఈ సందర్భంగా చీఫ్ విప్‌గా ఎవరిని నియమించాలన్న అంశంపై పార్టీలో చర్చ జరిగినట్టు తెలిసింది. అనుభవం, సభ్యులను సమన్వయం చేసే సమర్థత చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ఉన్నదని ఆ పదవికి ఆయనైతేనే న్యాయం చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి సహా ఇతర మంత్రులు అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. అయితే వివేక్ వెంకటస్వామికి ఈ విషయాన్ని చేరవేసి ఆయనను ఒప్పించే బాధ్యతను శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు అప్పగించారు. మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం వివేక్‌ను తన చాంబర్‌కు పిలిపించుకొని 'మీరు చీఫ్ విప్‌గా ఉండాలని అనుకుంటున్నాం..' అని చెప్పగానే ఆయన 'ఆ పదవి నాకెందుకు?' అని స్పందించినట్టు తెలిసింది. తనకు మంత్రి పదవి కావాలని మొదటి నుంచీ చెప్తున్న విషయాన్ని ఈ సందర్భంగా వివేక్ గుర్తుచేసినట్టు సమాచారం.

ఫైళ్లు జాగ్రత్త!

- మాయమైతే క్రిమినల్ కేసులు
- శాఖ కార్యదర్శులు, సెక్షన్ ఆఫీసర్లదే బాధ్యత
- అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కొన్ని విభాగాల్లో కీలక ఫైళ్లు మాయం అవుతున్నాయంటూ ఇటీవల తరుచూ వార్తలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. 2014 నుంచి ఇప్పటివరకు అన్ని రకాల పేపర్, డిజిటల్ దస్త్రాలను జాగ్రత్తగా కాపాడాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. ఆ బాధ్యతను సంబంధిత శాఖల కార్యదర్శులు చూసుకోవాలని స్పష్టం చేశారు. స్వయంగా సమీక్షించి ముఖ్యమైన, సున్నితమైన ఫైళ్ల పరిస్థితి ఏమిటి..? ఏవైనా మాయం అయ్యాయా..? అనేది గుర్తించాలని సూచించారు. సిబ్బందిలో ఏ ఒక్కరూ ఆఫీస్ నుంచి ఫైళ్లు తీసుకెళ్లొద్దని స్పష్టం చేశారు. ఏవైనా ఫైళ్లు మాయమయితే సెక్షన్ ఆఫీసర్లదే బాధ్యత అని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు వెల్లడించారు.

ఏడాదికో ఆయిల్‌పామ్ పరిశ్రమ

- పామాయిల్ సాగుతో రైతులకు స్థిరమైన ఆదాయం
- ఏటా 40 ఎకరాలు పెంచేలా కృషి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సచివాలయంలో మంత్రిగా బాధ్యతల స్వీకరణ
- మూడు కీలక ఫైళ్లపై సంతకం

హైదరాబాద్/ఖమ్మం, డిసెంబర్ 15(నమస్తే తెలంగాణ): వచ్చే ఐదేండ్లలో రాష్ట్రంలో ఏడాదికో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మూడు కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రూ.1050 కోట్ల వ్యయంతో ఐదు ఆయిల్‌పామ్ పరిశ్రమలు నెలకొల్పేందుకు ఆమోదం తెలుపుతూ సంబంధిత ఫైలుపై తొలి సంతకం చేశారు. రూ. 4.07 కోట్ల ఖర్చుతో 110 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు సంబంధించిన ఫైలుపై రెండో సంతకం, సహకార వ్యవస్థ కంప్యూటరీకరణకు సంబంధించిన ఫైలుపై మూడో సంతకం చేశారు. అనంతరం గద్వాలకు చెందిన పట్టుపరిశ్రమశాఖ అధికారి జగన్నాథ్ కుమారుడు ఆశిష్ కుమార్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ నియామకపత్రం అందజేశారు.



సచివాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఆయిల్‌పామ్‌తో స్థిరమైన ఆదాయం

బాధ్యతల స్వీకరణ అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్రంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఈ సాగువైపు దృష్టిసారించేలా అధికారులు దిశానిర్దేశం చేయాలని సూచించారు. దాదాపు 30 ఏండ్ల వరకు దిగుబడినిచ్చే దీర్ఘకాలిక పంటగా ఆయిల్‌పామ్ స్థిరమైన ఆదాయం ఇస్తుందని వివరించారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే పామాయిల్ సాగుతో ఎకరాకు రూ. లక్ష వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. ఇందులో అంతరపంటలు కూడా వేసుకోవచ్చని పేర్కొన్నారు. టీఎస్ ఆయిల్ ఫెడ్ ద్వారా 2023-24 సంవత్సరం నుంచి ప్రతిఏటా 40 వేల ఎకరాల విస్తీర్ణం పెంచేలా ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఇతర అధికారులు, మంత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు తెలిపారు.

'ఫార్మా'తో తీవ్ర కాలుష్యం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఫార్మా ఇండస్ట్రీతో 200 కిలోమీటర్ల మేర కాలుష్య ప్రభావం ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఎల్బీనగర్‌లో సిరీస్ ఫ్యాక్టరీతో వందల కిలోమీటర్లు కాలుష్యానికి గురైందని చెప్పారు. ఫార్మాసిటీతో ఇదే తరహాలో గాలి, నీరు కలుషితమయ్యేదని వివరించారు. తాను ఫార్మాసిటీని వ్యతిరేకించిన కారణంగానే 2018 ఎన్నికల్లో కొంత మంది ఫార్మా యజమానులు తనను కుట్రపన్ని ఓడించారని ఆరోపించారు. ఫార్మాసిటీని రద్దుచేయడంతో రంగారెడ్డి జిల్లావాసుల్లో పండుగ వాతావరణం నెలకొందని, ఫార్మాసిటీ ప్రాంతంలోని రైతులకు తమ ప్రభుత్వం న్యాయం చేస్తుందని చెప్పారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పాటుపడతాం

గ్రూప్-1 అధికారుల సంఘం

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వంతో సమన్వయం చేసుకొంటూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పాటుపడతామని గ్రూప్ -1 అధికారుల సంఘం నేతలు ప్రకటించారు. శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి హన్మంతు నాయక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపింది. పలు సమస్యల పరిష్కారానికి మరోసారి సీఎంతో భేటీ అవుతామని సంఘం నేతలు పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో నేతలు చౌడారపు శ్రీధర్, భవాని, శశిశ్రీ, జయశ్రీ, హరికిషన్, లింగ్యానాయక్, యూనుస్, అఖిలేశ్ రెడ్డి, మైత్రి ప్రియ తదితరులు ఉన్నారు.

సీఎంతో మైనార్టీ నేతల భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం సచివాలయంలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఆధ్వర్యంలో పలువురు ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు ప్రత్యేకంగా కలిశారు. సీఎంకు అభినందనలు తెలిపి, సన్మానించారు. అనంతరం మైనార్టీల సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సూచనలు చేశారు. సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు శివధర్‌రెడ్డి, షానవాజ్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- రిజర్వాయర్లలో నీటి మట్టాలను పర్యవేక్షించండి
- మిషన్ భగీరథ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో మిషన్ భగీరథ శాఖ చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ కార్యకలాపాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజూ నిశితంగా పర్యవేక్షించాలని, రాష్ట్రంలోని ప్రతి మారుమూల గ్రామానికి రోజువారీ నీటి సరఫరా జరిగేలా చూడాలని ఆమె ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లు, నదులు, తదితర తాగునీటి వనరుల స్థాయిలను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గినప్పుడల్లా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఇరిగేషన్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మేడారం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

మేడారం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. త్వరలో మేడారం జాతరపై సంబంధిత డిపార్ట్‌మెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

నలుగురు విప్‌ల నియామకం

- ఉమ్మడి కరీంనగర్ నుంచి ఇద్దరు, నల్లగొండ, వరంగల్ నుంచి ఒక్కొక్కరు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం అధికార పార్టీకి చెందిన నలుగురు శాసనసభ్యులను అసెంబ్లీలో విప్‌లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గెజిట్ విడుదల చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఇద్దరికి, ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాలకు చెందిన ఒక్కొక్కరు విప్‌లుగా నియమితులయ్యారు. ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచందర్‌నాయక్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రభుత్వ విప్‌లుగా నియమితులయ్యారు.

గవర్నర్ ప్రసంగం అభ్యంతరకరం

- కాంగ్రెస్ పార్టీ కరపత్రం చదివారు
- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెల